
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 5 జనవరి 2025




పీ8 విమానం నుంచి బాంబులు వేస్తున్న దృశ్యం

కళ్ల ముందు కదనరంగం


హెలికాప్టర్ నుంచి సముద్రంలో ఉన్న బోటుపైకి దిగుతున్న కమాండర్లు

- సముద్రంలో ఆయిల్ రిగ్‌ల పేల్చివేత
- తీరానికి సమీపంలో బారులుతీరిన యుద్ధ నౌకలు
- వేల అడుగుల ఎత్తు నుంచి కిందకు దిగిన మార్కోలు
- ఆకాశంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల చక్కర్లు


విన్యాసాలు తిలకిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, మనుమడు దేవాన్ష్, తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్

ఆద్యంతం కట్టిపడేసిన నేవీ సాహస విన్యాసాలు


విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): **కళ్ల ముందు ఆవిష్కృతమైన కదన రంగాన్ని విశాఖ ప్రజలు శనివారం సాయంత్రం కళ్లు అప్పగించి చూశారు. ఆకాశంలో ఎగురుతూ వచ్చిన హెలికాప్టర్ నుంచి మెరైన్ కమెండోలు తాడు సాయంతో కిందకు దిగి అక్కడ అప్పటికే సిద్ధంగా ఉన్న జెమినీ బోట్లలో తీరానికి చేరుకొని శత్రుస్థావరంపై చేసిన దాడి, శత్రు దేశాల ఆర్థిక సంపదను నాశనం చేస్తున్నట్టు సముద్రంలో ఆయిల్ రిగ్‌ల పేల్చివేత...నిజంగా యుద్ధ వాతావరణాన్నే తలపించింది.**

నేవీ డే సందర్భంగా డిసెంబరు 4న విన్యాసాల ప్రదర్శన ఈసారి పూరీ తీరంలో రాష్ట్రపతి ఎదుట నిర్వహించారు. విశాఖ ప్రజల కోసం మరోసారి శనివారం సాయంత్రం ప్రదర్శించారు. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భార్య భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు. తొలుత ఎనిమిది వేల అడుగుల ఎత్తులో గల అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ నుంచి దూకిన నలుగురు మార్కోలు పారాచ్యూట్ల సాయంతో లాఘవంగా ముఖ్య

... మిగతా 8వ పేజీలో


కనువిందు చేసిన లేజర్ షో

ఆర్థిక రాజధానిగా విశాఖ




- నాలెడ్జ్ హబ్, మారీటైమ్ గేట్‌వేగా రూపాంతరం
- డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ఒప్పందం
- భవనం ఎంపిక చేసుకున్న టీసీఎస్
- మరో ఏడాదిలో భోగాపురం విమానాశ్రయం నిర్మాణం పూర్తి
- 8న రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన
- స్టీల్‌ప్లాంటును పరిరక్షిస్తాం
- ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి జలాలు.. వచ్చే ఏడాది విశాఖకు
- నేవీ సేవలు మరువలేనివి
- నేవీ ఆపరేషన్ డెమోలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా మారనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్‌కే బీచ్‌లో తూర్పు నౌకాదళం శనివారం సాయంత్రం నిర్వహించిన సాహస విన్యాసాల ప్రదర్శనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ విశాఖ మేటి నగరంగా తయారవుతుందన్నారు. పర్యాటక రాజధానిగా, నాలెడ్జ్ హబ్ సిటీగా, మారీటైమ్ గేట్‌వేగా

... మిగతా 8వ పేజీలో


పారాచ్యూట్‌తో దిగుతున్న స్కైడైవర్స్


ఆయిల్ రిగ్ పేల్చివేతను తిలకిస్తున్న జనం

ఆయిల్‌పామ్‌కు మంచి రోజులు

కూటమి ప్రభుత్వంలో మరింత ప్రోత్సాహం

- రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ
- అంతర పంటలకూ చేయూత
- రికార్డు స్థాయిలో పెరిగిన ధర
- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం


చెట్ల నుంచి దించిన ఆయిల్‌పామ్ గెలలు

చోడవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): **ఆయిల్‌పామ్ సాగుకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఆయిల్‌పామ్ సాగుపై చూపించిన నిర్లక్ష్యం కారణంగా నిరాశ చెందిన రైతులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో . దర పలుకుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.**

గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీలు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాల పరంగా రైతులకు తగినంత ప్రోత్సాహం లేకపోవడంతో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై విముఖత చూపేవారు. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం సక్రమంగా లేకపోవడం, తోటలకు ఏడాదికి ఇచ్చే ఎరువులు, ఇతర నిర్వహణ ఖర్చుల రాయితీలు, మొక్కల రాయితీలు కూడా ప్రభుత్వం అప్పట్లో ఇవ్వకపోవడంతో రైతుల్లో నిరాసక్తత ఉండేది. దీంతో వీటి సాగు గత ఐదేళ్లలో తగ్గింది.

రైతులకు మరింత ప్రోత్సాహం

కూటమి ప్రభుత్వం వచ్చాక శతశాతం రాయితీపై మొక్కలు పంపిణీ చేస్తోంది. గతంలో రైతులు ఒక మొక్కకు రూ.133 చెల్లించేవారు. ఇప్పుడు ఉచితంగా పొందుతున్నారు. గతంలోలాగా కాకుండా ఇప్పుడు రైతులు దరఖాస్తు చేసిన వెంటనే డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నారు. అలాగే ఏడాదికి మొక్కల నిర్వహణ ఖర్చుల కింద హెక్టారుకు రూ.5,250 చొప్పున నాలుగేళ్లలో రూ.21 వేలు రైతులకు ప్రభుత్వం అందజేస్తున్నది. గరిష్ఠంగా ఒక రైతుకు 35 ఎకరాల వరకు సాగుకు ప్రోత్సాహం అందిస్తోంది. ఒకటి నుంచి ఐదు ఎకరాల లోపు డ్రిప్ సౌకర్యం కోసం 90 శాతం రాయితీ, 5 ఎకరాల నుంచి 12.5 ఎకరాల వరకు 50 శాతం రాయితీ లభిస్తున్నది.

అంతర పంటలకూ తోడ్పాటు

ఆయిల్‌పామ్ తోటలు ఎదిగేంత వరకు నాలుగేళ్లలో తోటల మధ్య అంతర పంటలుగా అరటి, కూరగాయలు, జామ, ఇతర రకాల పంటలు వేసుకోవడానికి రెండు హెక్టార్ల వరకూ ప్రభుత్వం రాయితీ కింద ఏడాదికి హెక్టారుకు రూ.5 వేలు చొప్పున అందించనుంది. గతంలో ఇది ఒక్క హెక్టారుకు మాత్రమే ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీని పరిమితిని రెండు హెక్టార్లకు పెంచింది.

మూడు కంపెనీల ఆధ్వర్యంలో సాగు

జిల్లాలో ప్రస్తుతం ఆయిల్‌పామ్ సాగు నాలుగు వేల హెక్టార్లలో ఉంది. జిల్లాలో మూడు కంపెనీల ఆధ్వర్యంలో ఈ ఆయిల్‌పామ్ సాగు అవుతున్నది. రుచి సోయా, శాంతి ఆయిల్‌పామ్ కంపెనీ, ఎఫ్ఎఫ్ఎఫ్ కంపెనీలు మండలాల్లో తోటలను ప్రోత్సహిస్తున్నాయి. శాంతి ఆయిల్‌పామ్ కంపెనీ పరిధిలో మాడుగుల, చోడవరం, అనకాపల్లి, కశింకోట, బుచ్చెయ్యపేట, పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాలు ఉన్నాయి. గతంలో రుచి సోయా, ప్రస్తుతం పతంజలి కంపెనీ పరిధిలో దేవరాపల్లి, మునగపాక, రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, పాయకరావుపేట, యలమంచిలి, రాంబిల్లి, మాకవరపాలెం

... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సందడి

- నర్సీపట్నంలో అయ్యన్నపాత్రుడు, సబ్బవరంలో అనిత, మిగతా చోట్ల ఎమ్మెల్యేలు, కూటమి నేతలు ప్రారంభించిన వైనం
- జిల్లాలో తొలి రోజు 4,700 మంది విద్యార్థులు హాజరు

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు

అనకాపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, నాలుగు హైస్కూలు ప్లస్‌లలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో ఆరు వేల మందికిపైగా విద్యార్థులు ఉండగా, 4,700 మంది తొలి రోజు భోజనం చేశారు. నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మానవ వనరుల అభివృద్ధిశాఖామంత్రి నారా లోకేశ్‌ల సమక్షంలో ఈ పథకానికి రూపకల్పన చేశారని తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోజన పథకాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డ్రాపౌట్స్ తగ్గడానికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే విద్యార్థులు మధ్యాహ్న సమయంలో భోజనం కోసం పడే ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. మాడుగుల జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, చోడవరం జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్. రాజు పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొన్నారు.


నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు


సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు

నేడే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి



అనకాపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే 'ఆంధ్ర జ్యోతి', 'ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి', ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు...గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) అనకాపల్లిలోని ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో ఆదివారం ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయకు రూ.4 వేలు, తృతీయ స్థానానికి రూ.3 వేలు బహుమతిగా అందించనున్నారు. ముగ్గు, రంగులు వగైరా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ (ఫోన్ నంబర్: 99854 11045) చేయించుకోవాలి. అనకాపల్లిలో నిర్వహించే పోటీలకు కొణతాల సుబ్రహ్మణ్యం, అప్పలనరసమ్మ ట్రస్టు స్పాన్సర్‌గా వ్యవహరించ నున్నది.

ప్రధాని సభకు

ఏయూలో సభకు 1,40,000 మంది, రోడ్‌షోకు 60 వేల నుంచి 70 వేల మంది...

జన సమీకరణపై కసరత్తు

- జనం తరలింపునకు 2,000 బస్సులు
- ఏర్పాట్ల పర్యవేక్షణకు పొరుగు జిల్లాల నుంచి ఐఏఎస్ అధికారులు
- మరో 10 మంది డిప్యూటీ కలెక్టర్లు, 20 మంది తహసీల్దార్లు
- అన్ని శాఖల అధికారులతో 42 కమిటీలు ఏర్పాటు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఎనిమిదో తేదీన ప్రధాని నరేంద్రమోదీ నగర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు ఐఏఎస్ అధికారులను ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ అశోక్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తోపాటు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంతకుమార్‌రెడ్డిలకు ప్రధాని పర్యటనకు సంబంధించి పలు బాధ్యతలు అప్పగించారు. వీరు కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మరో పది మంది డిప్యూటీ కలెక్టర్లు, 20 మంది తహసీల్దార్లు, ఇంకా రవాణ, పౌర సరఫరాలు, రోడ్లు, భవనాల

... మిగతా 8వ పేజీలో


ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో సిదమవుతున్న సభాస్థలి

పూడిమడకలో రాష్ట్రస్థాయి
బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుందరపు సతీశ్‌కుమార్

అచ్యుతాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పూడిమడకలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలను జనసేన ఉత్తరాంధ్ర జిల్లాల రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార యువకులు క్రీడల్లో రాణించి నియోజక వర్గానికి మంచి పేరు తేవాలన్నారు. సరైన వసతులు లేనప్పటికి జిల్లాలో అతిపెద్ద మత్స్యకార్ల గ్రామమైన పూడిమడకలో రాష్ట్రస్థాయి పోటీలను ఎమ్మెల్యే విజయకుమార్ ఏర్పాటు చేశారని, ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ఆంధ్రప్రదేశ్ తరపున ఉత్తరాఖండ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు పంపుతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సత్యనారాయణ, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.సూర్యనారాయణ, బీచ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ అబ్జర్వర్ మోహన్ కుమార్, నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, మోటూరు శ్రీవేణి, మేరుగు బాపు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తులసీ ఘాట్‌లో ఆడారి తులసీరావుకు నివాళి



తులసీరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆనంద్, రమాకుమారి

ఎలమంచిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి సమీపంలోని తులసీ ఘాట్ వద్ద శనివారం విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కుమారుడు, కుమార్తె విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, పిళ్లా రమాకుమారి, కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతాంగానికి ఆయన అందించిన సేవలను అంతా కీర్తించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆడారి శ్రీధర్, స్థానిక నాయకులు ఆడారి వెంకట్, పిట్టా శ్రీను, కొండబాబు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

రాంబిల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ అన్నారు. మండలంలోని మూలజంపలో శనివారం ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులను అంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. టీడీపీ మండల ఉపాధ్యక్షులు అందుకూరి ప్రసాద్, సర్పంచ్ వేగి అచ్చినాయుడు, మాజీ సర్పంచ్ వేగి రాము, వీఆర్వో కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో 'భోజనం' ప్రారంభం





ఎలమంచిలి కళాశాలలో భోజనాన్ని వడ్డిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, మునగపాక ఏపీ మోడల్ స్కూల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

ఎలమంచిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లాంఛనంగా ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ ప్రారంభించారు. అధ్యాపకులంతా విద్యార్థులకు ఆనందంగా భోజనాలను వడ్డించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరుప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా లక్ష్యంతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని పేర్కొన్నారు. తొలిరోజు సుమారు 596 మంది విద్యార్థినీ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. ఇదిలావుంటే, ఈ పథకం ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాలేదు. దీంతో వారు విచ్చేసి దిశా నిర్దేశం చేస్తారని ఆశించినవారు నిరుత్సాహానికి గురయ్యారు. ఏది ఏమైనప్పటికీ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడంపై విద్యార్థులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మునగపాక : ఇక్కడి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోని అన్ని గ్రూపుల్లో చదువుతున్న 134 మంది విద్యార్థినులకు ఈ పథకం ద్వారా భోజనాన్ని వడ్డించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

'పాఠశాలల్లో విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి'

ఎలమంచిలి/మునగపాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు గుణాత్మక విద్యనందించేందుకు అంతా కృషి చేయాలని ఎంఈవోలు అరుణ్‌కుమార్, మీనాక్షి అన్నారు. శనివారం ఇక్కడి శ్రీచైతన్య స్కూల్ ఆవరణలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్య కమిటీల సభ్యులకు ఏర్పాటైన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సాయిబాబా, వై.వి.రమణ, అన్ని పాఠశాలల హెచ్ఎంలు, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే, మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్షణ తరగతుల్లో పాఠశాలల అభివృదికి ఎంఈవో బుద్ద శివనాయుడు ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీల సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు సిహెచ్.వెంకటరమణ, ఎస్.వి.సిహెచ్.సత్యనారాయణ, కె.రామచంద్రరావు, భీశెట్టి జోగినాయుడు, పి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి'



కొత్తపేట పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఎలమంచిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. ఎలమంచిలిలోని కొత్తపేటలో జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు పది ఉన్నత పాఠశాలలు, కొక్కిరాపల్లి బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావ్యాప్తికి కొత్త ప్రభుత్వం కొత్త నిర్ణయాలు తీసుకున్నట్టు చెప్పారు. సంక్రాంతి పర్వదినాలు తెలుగువారికి ఎంతో ప్రాధాన్యతతో కూడినవని, ఈ పండుగ సెలవులు మరిన్ని రోజులు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. పదో తరగతి విద్యార్థుల ఉన్నతికి వంద రోజుల ప్రణాళిక చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెకే ఎల్ఎన్ ధర్మారావు, మాజీ అధ్యక్షుడు ఎన్‌వీ సూర్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు బొడ్డేడ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లి పాటి సత్యనారాయణ, ప్రతినిధులు వీరభద్రరావు, లక్ష్మణరావు, అప్పారావు, చంద్రశేఖర్‌లతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో 'స్వచ్ఛతే సేవ'



వాడనర్సాపురంలో చెత్తాచెదారం తొలగిస్తున్న అధికారులు

రాంబిల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి అన్నారు. మండలంలోని రాంబిల్లి, వాడనర్సాపురం, నారాయణపురం, అప్పారాయుడుపాలెం గ్రామాల్లో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్‌డీ రాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసు ప్రొవైడర్ల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి : మెప్మా పీడీ సరోజని



సర్వీసు ప్రొవైడర్ల గుర్తింపు మేళాలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సరోజిని

ఎలమంచిలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సర్వీసు ప్రొవైడర్లకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం అవలంబిస్తున్న కార్యక్రమాలను అందిపుచ్చుకునేందుకు వృత్తి కార్మికులు ముందుకు రావాలని మెప్మా పీడీ ఎన్.సరోజిని అన్నారు. మునిసిపల్ కార్యాలయం ఆవరణలో శనివారం సర్వీసు ప్రొవైడర్ల గుర్తింపు మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ పేదరిక నిర్మూలనా సంస్థ ద్వారా సర్వీసు ప్రొవైడర్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక చేపట్టిందన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ద్వారా తర్ఫీదునిచ్చి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు మాట్లాడుతూ వృత్తి కార్మికులకు జీవనోపాధిని కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక అధికారి సత్యనారాయణ, వరలక్ష్మి, మెప్మా సీఎంఎం పద్మావతి పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

మునగపాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంధుల పితామహుడు లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో బుద్ద శివనాయుడు మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు బ్రెయిలీ అని పేర్కొన్నారు. వీరికి సులభంగా అర్థమయ్యేరీతిలో బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వీరు అన్నిరంగాల్లో రాణించేలా కృషిచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సహిత విద్య ఉపాధ్యాయులు విజయేశ్వర్, భవానీ, సీఆర్పీలు బొడ్డేడ అచ్యుతకృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై గోవర్ధనుడు



స్వామివారి తిరువీధి ఉత్సవంలో భక్తులు

నక్కపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం గరుడ వాహనంపై గోవర్ధనుడి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. శనివారం కావడంతో అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చారు. వారి గోత్రనామాలతో అర్చకులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గరుడ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకీలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశురం విన్నపం చేశారు.

వామనావతారంలో పాండురంగడు



గోదాదేవికి సారె సమర్పిస్తున్న వికాసతరంగిణి సభ్యులు

పాయకరావుపేట: స్థానిక రాధారుక్మిణి సహిత పాండురంగ స్వామి దేవస్థానంలో నిర్వ హిస్తున్న ధనుర్మాస ఉత్స వాల్లో భాగంగా శనివారం స్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధా నార్చకుడు కృష్ణ స్వామి స్వామివారిని వామన రూపుడిగా అలం కరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.దివ్యజ్యోతి తదితరులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వికాస తరంగిణి సభ్యులు గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు రిందా ఆండాళ్‌తోపాటు మహిళలు పాల్గొన్నారు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీరాజు, తదితరులు

కోటవురట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిషత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు అన్నారు. శనివారం స్థానిక మైదానంలో సంక్రాంతి పురస్కరించుకుని ప్రీమియర్‌లీగ్ క్రికెట్ మ్యాచ్‌లను ఆయనతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు జానకీ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ ఎస్. రమేశ్ ప్రారంభించారు. ఈ పోటీలు 14వతేదీ వరకు క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల గాజువాకకు చెందిన నితీశ్‌కుమార్ రెడ్డి అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణించి విశాఖ జిల్లా పేరుప్రతిష్టలు తీసుకువచ్చారన్నారు. ఆ యువకుడి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు, సర్పంచ్ అనిల్‌కుమార్, పాయకరావుపేట డీటీ గారా ఆనందరావు, కొయ్యూరు ఎంపీడీవో ఎస్. కిరణ్‌వరప్రసాద్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో విద్యార్థులు భోజనాలు వడ్డిస్తున్న కూటమి నాయకులు



నక్కపల్లిలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తున్న దృశ్యం

గ్రామీణ ప్రాంత విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ నేత చిట్టిబాబు

పాయకరావుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి నాయకులు, అధికారులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కెశైలజ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి తదితరులు మాట్లాడుతూ... ఇంటర్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో అమలుచేస్తున్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కేఎస్ గాంధీ, రమేష్‌తోపాటు కూటమి నాయకులు గొర్రెల రాజబాబు, పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాస్, ఎం.రమాకుమారి, మలిపెద్ది వెంకటరమణ, గెడ్డం చైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైంది. ముందుగా ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సర్పంచ్ జయరత్నకుమారి, ఎంపీపీ ఏనుగుపల్లిరత్నం, జడ్పీటీసీ గోసల కాసులమ్మ, కూటమి నాయకులు వైబోయిన రమణ, కోసూరి శ్రీను, వెలగా సుధాకర్, నల్లల రత్నాజీ, ఎంఈవోలు నరేశ్, వేమగిరి నూకరాజు పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల: పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షులు జానకీ శ్రీనివాసరావు అన్నారు.శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుజాత ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రారంభించారు. ఎంఈవోలు రామారావు, జోషి ,హైస్కూల్ హెచ్ఎం శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కొండబాబు, ఎంపీటీసీ సూర్యారావు, సర్పంచ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోటవురట్ల జూనియర్ కళాశాలలో..

చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



పెదరాంభద్రపురంలో సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది

పాయకరావుపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలని ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు కోరారు. మండలంలోని పెదరాంభద్రపురం, పాల్తేరు గ్రామాల్లో ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖరరావు, కార్యదర్శులు వై.వి. సత్యనారాయణ, దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని అమలాపురం సచివాలయాన్ని శనివారం మండల ప్రత్యేకాధికారి పి.ప్రసాద్, తహసీల్దార్ డి. సీతారామరాజు తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పనితీరుపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు. గ్రామంలో సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నక్కపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి వీవర్స్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం మండల ప్రత్యేకాధికారి పి.ప్రసాద్, ఎంపీడీవో డీ సీతారామరాజు తనిఖీ చేశారు. పిల్లలకు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం ఇతర పథకాలను వివరించారు. కొత్తగా వచ్చి పాఠ్యపుస్తకాలకు పిల్లలకు అందజేశారు. సూపర్‌వైజర్ సత్య, దుర్గారాజీ పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ఎస్. రాయవరం: రెవెన్యూ సదుస్సులు ముగిసినట్టు తహసీల్దార్ జె రమేశ్‌బాబు తెలిపారు. శనివారం వాకపాడు లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 9 వినతులు స్వీకరించారు.

ప్రజాభిప్రాయం లేకుండా బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు అన్యాయం

» సీపీఎం నేత లోకనాథం



నిరసన తెలుపుతున్న జనాలు, సీపీఎం నాయకులు

నక్కపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో ప్రకృతిని, పర్యావరణానికి నష్ట కలిగించే బల్క్‌డ్రగ్‌పార్కు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని పాటిమీద, తమ్మయ్యపేట, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో మత్స్యకారులు, చేతివృత్తిదారులు, రైతులు తీవ్రస్థాయిలో దెబ్బతింటారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోనికి తీసుకోకుండా ఏకపక్షంగా బల్క్‌డ్రగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అప్రజాస్వామికమన్నారు. పూర్తిస్థాయిలో భూములిచ్చిన రైతులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా కారిడార్ భూముల్లో చెట్లు తొలగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నిరసన తెలియజేశారు. దీనిపై ఈ నెల 8న నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం. రాజేశ్, షైలపల్లి మహేశ్, జాన్, రావి అప్పారావు, రావి చిన్నమ్ములు, బాబ్జీ, ప్రసాద్, అమ్మోజీ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినంధన



అనితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఈదటం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం బాక్సింగ్ ఛాంపియన్ కొరుప్రోలు అనితను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ 2022-23లో పదో తరగతిని చదివిన అనిత ఇటీవల గోవాలో నిర్వహించిన అండర్-17 బాక్సింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆమెనుహెచ్ఎం. ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా బ్రెయిలీ దినోత్సవం



నక్కపల్లి: లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని హెచ్ఎం అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అంధుల కోసం బ్రెయిలీ లిపిని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని స్థానిక పీహెచ్.వాడ ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 రమేశ్ మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే, దివ్యాంగ విద్యార్థులకు ప్లాంక్‌లు, పుస్తకాలు పంపిణీచేశారు. హెచ్ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీను, క్రాంతికుమారి పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

ఎస్.రాయవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలివి.. ఎస్.రాయవరం కూడలిలో శనివారం దాడులు నిర్వహించి సైతారుపేట గ్రామానికి చెందిన జి.రామకృష్ణ అనే వ్యక్తిని పట్టుకుని అతడి నుంచి ఈ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపండి

▸▸ పోలీసు సిబ్బందికి హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశం

▸▸ సబ్బవరం పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న హోం మంత్రి అనిత

సబ్బవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణాను అరికట్టేందుకు ఉక్కు పాదం మోపాలను హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సబ్బవరం పోలీసు స్టేషన్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలు తెలుసుకున్నారు. రౌడీషీటర్ల వివరాలు, స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరు తదితరాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడేవారికి ఎట్టిపరిస్థితుల్లో విడిచిపెట్టవద్దన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, మహిళల రక్షణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాంతిభద్రల పరిరక్షలో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రమణ పాల్గొన్నారు.

స్వల్ప కాలిక పంటల సాగుకు రబీ ఆశాజనకం

▸▸ ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ ముకుందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అపరాలు, నువ్వులు వంటి స్వల్ప కాలిక పంటలకు ప్రస్తుత రబీ సీజన్ మంచి అనుకూలమని వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. శనివారం పరిశోధనా స్థానంలో జరిగిన జిల్లా వ్యవసాయ సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఖరీఫ్‌లో, డిసెంబరులో కురిసిన వర్షాల వలన నేలలో తేమ బాగా ఉందన్నారు. ఇటువంటి తరుణంలో రబీ పంటలు స్వల్ప కాలంలోనే మంచి దిగుబడులను ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. అధిక వర్షాలు, రెల్లరాల్చు పురుగు వంటి సమస్యలు ఎదురైనప్పటికీ ఖరీఫ్ వరి రైతులు గతంతో పోల్చితే మంచి దిగుబడులు పొందుతున్నారని వ్యవసాయ శాఖాధికారి సీహెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, కె.వి.రమణమూర్తి, భవానీ, పీవీకే జగన్నాథరావు, ఉమామహేశ్వరరావు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ వద్ద బుద్ధుని విగ్రహం ఆవిష్కరణ



బుద్ధ విగ్రహం ఆవిష్కరణకు హాజరైన నాయకులు

తుమ్మపాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద 12 అడుగుల భారీ బుద్ధ విగ్రహాన్ని శనివారం జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొజ్జన్నకొండ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారాలు అందిస్తుండడం ఆనందదాయకమన్నారు. కూటమి నాయకులు పీలా తాతునాయుడు, చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి, పీలా విశ్వేశ్వరరావు, బొడ్డపాటి రామ్‌కుమార్, ఆడారి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం : డీఎంహెచ్‌వో



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో

తుమ్మపాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పీహెచ్‌సీలకు వస్తున్న రోగులకుమెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రవి కుమార్ సూచించారు. శనివారం తుమ్మపాల పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. అలాగే ఎన్‌సీడీ 3.0 సర్వే లక్ష్యాన్ని పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వాణి జగదీశ్వరి, సీహెచ్‌వో డి.శారద, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ బి.సంగం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల ఆందోళన

అనకాపల్లి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు వలంటీర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట పలువురు వలంటీర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించి, నెలకు రూ. పదివేలు జీతం ఇవ్వాలని క ఓరారు. అనంతరం ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ జిల్లా కన్వీనర్ ఎస్‌కే పీర్‌సాహెబ్, సీహెచ్. కొర్లయ్య, ఎ.అప్పారావు, ఎస్.జ్యోతి, జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని బహిరంగ సభను జయప్రదం చేయాలి : ఎంపీపీ

సబ్బవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని ఏయూ గ్రౌండ్‌లో ఈనెల ఎనిమిదో తేదీన జరగనున్న ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను అంతా జయప్రదం చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి పిలుపునిచ్చారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పలు శాఖల అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో పి.పద్మజ, ఏవో శివరామప్రసాద్, ఈవోపీఆర్డీ బి.చైతన్య తదితరులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై కొండుపాలెంలో పూరిపాక దగ్ధం

తుమ్మపాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొండుపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి గ్యాస్ లీకవ్వడంతో పూరిపాక దగ్ధమైంది. ఇంట్లో కోట్ని సన్యాసిరావు కుటుంబ సభ్యులతో నిద్రపోతున్న సమయంలో సిలెండర్ నుంచి ఇక్కసారిగా గ్యాస్ లీకవ్వడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు గమనించి ఆ వృద్ధ దంపతులను రక్షించడంతో పాటు మంటలను అదుపు చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకునేలోపే పూరిపాక పూర్తిగా దగ్ధమైంది. స్థానిక కో-ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు బాధిత కుటుంబానికి రూ.పదివేలు విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. తీవ్రంగా నష్టపోయిన వృద్ధ దంపతులను అధికారులు ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

ఆనందమానందమాయె..

▸▸ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం ▸▸ హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



అనకాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పీలా గోవింద

అనకాపల్లి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకే కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన భోజన పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశ్యంతోనే విద్యాశాఖకు అధిక నిధులను ప్రభుత్వం



పరవాడ కళాశాలలో పథకం ప్రారంభోత్సవంలో తహసీల్దార్ అంబేద్కర్ తదితరులు

కేటాయించిందన్నారు. విద్యార్థుల కోరిక మేరకు మూడు నెలల్లో పర్నీచర్ ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా అనకాపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థినీ విద్యార్థులను సత్కరించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రాధిక, ఎంఈవో కోటేశ్వరరావు, మాదంశెట్టి నీలబాబు, బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, కాయల మురళీధర్, సూరే సతీష్, దాడి జగన్, ఎస్.భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు ప్రారంభించారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పబ్లిక్ పరీక్షల్లో కళాశాలలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధ్యాపకులు కృషిచేయాలన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను కూడా ప్రభుత్వం సరఫరా చేయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు, నాయకులు పైలా సన్యాసిరావు, పైలా చిన అక్కునాయుడు, వియ్యపు చిన్న, నర్సింగరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత : కలెక్టర్



విజ్ఞాన ప్రదర్శన ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

కశింకోట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి తమ చుట్టూ ఉండే సమస్యలకు పరిష్కారాలను వెతుక్కోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. ఈ ప్రదర్శనలో ఏర్పాటైన నమూనాల్లో కొన్నింటిని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు, ఉప విద్యాశాఖాధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు విద్యతో పాటు వినయం ఉంటే ఉజ్వల భవిష్యత్తు

న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన యువజనోత్సవాల్లో

ఆదాయపన్ను శాఖ కమిషనర్ శ్రీధర్



ఉత్సవాల ప్రారంభోత్సవంలో కమిషనర్ శ్రీధర్, వీసీ తదితరులు

సబ్బవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆదాయపన్ను శాఖ కమిషనర్ ఎన్.శ్రీధర్ పిలుపునిచ్చారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్స వాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత ఈ వేడుకలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లా డుతూ జీవితంలో ఎదగాలంటే విద్యార్థులకు విద్యతో పాటు వినయం అవసరమన్నారు. హక్కులతో పాటు బాధ్యతలను కూడా నెరవేర్చాలని పేర్కొన్నారు. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని వివరించారు. అనంతరం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ యువత స్థిర నిర్ణయం, విశ్వాసం కలిగి ఉండాలన్నారు. స్వామి వివేకానందను అర్థం చేసుకుంటే భారతీయ సమాజాన్ని అర్థం చేసుకున్నట్టేనన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీ గీతా సర్వానంద, న్యాయ వాది రాంబాబు, ఎం.సత్యనారాయణరాజు, అధ్యాపకులు పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన బుద్ద నాగజగదీశ్



కొత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఆర్‌కే బీచ్‌లో నేవీ డే ఉత్సవాలకు శనివారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు విమానాశ్రమంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళి

పరవాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంధుల పితామహుడు లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం స్థానిక మరిడిమాంబ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తొలిత బ్రెయిలీ చిత్రపటానికి జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, ఎంపీటీసీ పైలా శ్రీనువాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు బ్రెయిలీ అని పేర్కొన్నారు. జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, సాధన సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, అంధుల సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు అర్జునరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కొణతాల జన్మదిన వేడుకలు





పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాంకీ, వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శనివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను జనసేన నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌరీ హోల్‌సేల్, రిటైల్ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో కొణతాల జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల జగ్గఅప్పారావు, కాండ్రేగుల ఆదినారాయణ పాల్గొన్నారు. అలాగే నెహ్రూచౌక్‌లో జనసేన నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున కేకు కట్ చేసి పేదలకు ఆహార పదార్థాలను అందజేశారు. గాంధీనగరంలోని పశు వైద్యశాల కార్యాలయం వద్ద అక్షయ్ సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇదిలావుంటే, ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో మూడు రోజులపాటు జరిగిన కేఆర్‌కే కప్ క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశాయి. విన్నర్‌గా కొత్తూరు సిరసపల్లి గ్రామానికి చెందిన ఏకె రాజ్ జట్టు, రన్నర్‌గా ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ జట్టు నిలిచాయి. మ్యాన్ ఆఫ్‌ది సీరిస్‌గా సాయి, బెస్ట్ బౌలర్‌గా దివాకర్‌లు ఎంపికయ్యారు. వీరికి రింగురోడ్డులోని జనసేన కార్యాలయంలో బహుమతులు అందజేశారు.

కొత్తూరు : ఎమ్మెల్యే కొణతాల జన్మదినం సందర్భంగా ఏఎంఏఎల్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్ క్రాస్ ఇండియా సొసైటీ, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) ప్రారంభించారు. అనకాపల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు 75 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు పాల్గొన్నారు. అలాగే పినినికాడలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి దుప్పట్లు పంపిణీ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాంకీ

కశింకోట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెంలో కూటమి నేతల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే గత రెండు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలకు జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ బహుమతులు అందజేశారు. ముందుగా జన్మదిన కేకును కట్ చేసి అభిమానులకు తినిపించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లో అనకాపల్లి నియోజకవర్గం అభివృద్ధికి రూ.60కోట్లు నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, కూటమి నేతలు గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, సిది రెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్‌కుమార్, తాకాశి కృష్ణ, ద్వారపురెడ్డి సత్తిబాబు, కాయల మురళీ, కర్రి వెంకట సత్యనారాయణ, ఎస్.కె.రెహ్మాన్ (బాబర్), సిదిరెడ్డి సూర్యనారాయణ (చిన్న), సిదిరెడ్డి వెంకటేశ్వరరావు (శ్రీను), యలమంచిలి వెంకటరావు, కలిగెట్ల సంజీవి, లచ్చబాబు, శేషు, ఉగ్గిన రమణమూర్తి, కలగా సోమేశ్వరరావు, బుదిరెడ్డి రామునాయుడు, బుదిరెడ్డి గంగయ్య, గోవిందరావు, తిర్రి చిరంజీవి, రామారావు, మేడిశెట్టి నాగరామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఏఎస్ఐలకు పదోన్నతి



డీఐజీ కార్యాలయం ఎదుట పదోన్నతి పొందిన సిబ్బంది

అనకాపల్లి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఏఎస్ఐలకు పదోన్నతి కల్పిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన గిరి, అర్జున్, సన్యాసిరావులకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పించి ఇదే జిల్లాకు కేటాయించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఏఎస్ఐ శంకరరావుకు ఎస్ఐ పదోన్నతి కల్పించి ఆ జిల్లాకే కేటాయించారు. పదోన్నతి పొందినవారు శనివారం విశాఖలోని డీఐజీ కార్యాలయానికి వెళ్లి డీఐజీకి కృతజ్ఞతలు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కొత్తూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం రాజీవ్‌నగర్‌కు చెందిన గండిమేను సత్యవతి (63) ఇంటిపక్కనే ఉన్న బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. సత్యవతి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు చెప్పారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పింఛన్‌దారుల ధ్రువపత్రాల పరిశీలన


మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరోగ్య, దివ్యాంగ పెన్షన్ల ధ్రువపత్రాలను పరిశీలించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పరిశీలనకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేజీహెచ్ నుంచి ఇద్దరు వైద్య నిపుణులు, స్థానిక వైద్యుడు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఒక బృందంగా ఏర్పాటై లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ధ్రువపత్రాలను పరిశీలిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 76 మంది మాత్రమే ఆరోగ్య, దివ్యాంగ పెన్షన్ పొందుతున్న వారున్నారని, నాలుగు రోజుల్లో వారి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళీ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి జమాల్‌బాషా, డీపీవో బి.లవరాజు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, సీఐ డి.దీనబంధు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కొణతాల' జన్మదిన వేడుకలు


అనాథాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ నేతలు

పాడేరురూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ 68వ జన్మదిన వేడుకలకు పాడేరు గుడివాడవీధిలో ఉన్న నవజీవన్ అనాథాశ్రమ విద్యార్థుల మధ్య జనసేన పార్టీ నాయకులు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు లంకెల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉన్న 86 మంది విద్యార్థులతో జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేయించారు. పిల్లలకు కేక్, స్వీట్‌లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టి ఆనంద్, కిల్లు భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ నుంచి రాయితీ రుణాల కోసం నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ నుంచి పాడేరు మండలంలో 25 యూనిట్లకు గానూ రూ. 47.22 లక్షలు మంజూరయ్యాయన్నారు. రూ. 2 లక్షల వరకు యూనిట్‌కు రూ. 75 వేలు, రూ. 2లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు యూనిట్‌కు రూ. 1 లక్ష 25 వేలు, రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల యూనిట్‌కు రూ. 2 లక్షల వరకు రాయితీ ఉంటుందన్నారు. ఆ సక్తిగల అభ్యర్థులు బ్యాంక్‌ల నుంచి క్లియరెన్స్ తీసుకొని దరఖాస్తులు చేసుకుంటే రుణాలందిస్తామన్నారు.

'అరకు ఉత్సవాలపై పునరాలోచించాలి'


మాట్లాడుతున్న ఆదివాసీ నేతలు

పాడేరురూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అరకు ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ కోరారు. జీవో 3 సుప్రీం కోర్టు రద్దు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో డోలీ మోతలతో రోగులను తీసుకువెళ్తున్నారని, ఆదివాసీ ఉద్యోగులకు ఎటువంటి పదోన్నతులు లేవని, , టూరిజం నిధులు స్థానిక పంచాయతీలకు కేటాయించలేదని, ఉపాధి కోసం యువత వలసపోతున్నారన్నారు. ఈస్థితిలో అరకు ఉత్సవాలు ఎవరి ఆనందం కోసం ఏర్పాటు చేస్తున్నారో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

ఏయూ దూర విద్య డిగ్రీ పరీక్ష ఫీజు గడువు 20

పాడేరురూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో ఆంధ్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ నంబరు 066 ద్వారా 2018 నుంచి 2023 వరకు బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో అడ్మిషన్‌లు పొందిన విద్యార్థులు పరీక్ష ఫీజు ఈ నెల 25వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు కళాశాల స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

30 వరకు అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ పరీక్ష..

డాక్టర్.బీఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ 1, 3, 5 పరీక్ష ఫీజులు ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించాలని వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎస్.రసూల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల్లో అధ్యయన కేంద్రం 128 ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీల్లో అడ్మిషన్‌లు పొందినవిద్యార్థులు పరీక్ష ఫీజులను ఈ నెల 30వ లోగా చెల్లించాలన్నారు.అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వెబ్‌సైట్‌లో ఈ ఫీజు చెల్లించాలన్నారు.వివరాలకు ఫోన్లు: 94904 58695, 73829 29728కు సంప్రదించాలన్నారు.

నేడు తొంకోట జాతర

హుకుంపేట జనవరి 4 ఆంధ్రజ్యోతి ; మండలంలోని గిరిజనులకు ఆరాధ దైవం తొంకోటలోని భైరవ మూర్తి పంచపాండవులు జాతర ఆదివారం ప్రారంభం కానుంది. సోమవారం వరకు భక్తులు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. గిరిజనులతోపాటు మైదానప్రాంతంనుంచి భక్తులు తరలివస్తారు. ఏజెన్సీలో ఈ పండుగ నిర్వహించిన తర్వాత సంక్రాంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.


చింతపల్లిలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ్


సీలేరులో మధ్యాహ్న భోజనాలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, సర్పంచ్

విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ
- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం

చింతపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అందుబాటులోకి తీసుకువచ్చినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల విద్యార్థులకు మంచి పోషకాహారం అందుతుందన్నారు. డ్రాపౌట్ విద్యార్థుల సంఖ్య తగ్గుతుందన్నారు. విద్యార్థులు విద్యలో రాణించాలన్నారు. తాను ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో విద్యాభ్యాసం చేసి ఎంబీబీఎస్ పూర్తి చేశానని, అనంతరం సివిల్స్‌పై ఉన్నత ఆసక్తితో ఐఏఎస్ అధికారిని కాగలిగానన్నారు. ప్రతి విద్యార్థి కృషి, పట్టుదల, ప్రణాళికతో చదివితే సాధించలేనిది ఏమీలేదన్నారు. విద్యార్థులు గంజాయి, మత్తుపానీయాలకు దూరంగా ఉండాలన్నారు. నిర్వాహకులు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. మెనూపాటించకపోయినట్లయితే, ప్రిన్సిపాల్‌కి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అనంతరం జేసీ విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూ ఎస్‌వీ శ్రీనివాసరావు, జీసీడీవో సూర్యకుమారి, ప్రిన్సిపాల్ గోవిందరావు, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, కూటమినాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, అర్జున్, రామకృష్ణ, నాగ భూషణం, ఎంపీటీసీ ధారలక్ష్మిపద్మ పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రిన్సిపాల్ వి. శంకరరావు, సర్పంచ్ పి. దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో 95 మంది విద్యార్థులకు గాను 49 మంది హాస్టల్ వసతి వినియోగించుకోగా, 46 మంది మాత్రమే మధ్యాహ్న భోజన పథకానికి అర్హులని ఆయన తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలు కలసి విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లీప్రసాద్, కూటమి నాయకులు చిటికెల రాము, బాలకృష్ణ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నాం భోజన పథకాన్ని జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు ప్రారంభించారు.. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్నాం భోజన పథకం మార్పుచేసి, నాణ్యమైన మెనూ అందించేందుకు ప్రభుత్వం కృషిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలజీ, ప్రిన్సిపల్ ప్రమీల, సీనియర్ ఉపాధ్యాయులు పడాల్, తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరిలో..

పెరటి కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం

హైదరాబాద్ ఐసీఏఆర్-డీపీఆర్ ప్రధాన శాస్త్రవేత్త రాజు


రైతులకు కోళ్ల గూళ్లు పంపిణీ చేస్తున్న ఐసీఏఆర్-డీపీఆర్ శాస్త్రవేత్తలు

జి.మాడుగుల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందచ్చునని హైదరాబాద్ రాజేంద్ర నగర్ భాయతీయ వ్యవసాయ పరిశోధన మండలి, కోళ్ల పరిశోధన సంచాలనాలయం (ఐసీఏఆర్-డీపీఆర్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ ఎల్ఎన్ రాజు అన్నారు. శనివారం మండలంలోని సరియ, పద్మాపురం, తోకచిలక, బూసుపల్లి,కాయబండ, గొప్పులపాలెం, కృష్ణాపురం గ్రామాల్లో గిరిజన ఉప ప్రణాళిక నిధులతో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్ర సహకారంతో ఐసీఏఆర్ - డీపీఆర్ శాస్త్రవేత్తలు 100మంది ఆదివాసీ రైతుల కు కోళ్ల గూళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. జెనెటిక్స్ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఐసీఏఆర్-డీపీఆర్‌లో వనరాజ, గిరిరాజ, వనశ్రీ, రాజశ్రీ, గ్రామ ప్రియ రకాల కోళ్లను అభివృద్ధి చేశామన్నారు. ఈ కోళ్లను రైతులకు వీటిని అందిస్తున్నట్టు చెప్పారు. బీసీటీ కేవీకే పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయరాజ్ఞి మాట్లాడుతూ కోళ్లకు వ్యాధులు ప్రబలకుండగా టీకాలు వేయించాలన్నారు. బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ, కోళ్లపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశ్, కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్, ఐసీఏఆర్‌డీపీఆర్ మాజీ ఎంపీపీ కె. రాజు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి స్టీలు గేట్లు వితరణ

పాడేరురూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయానికి భక్తులు సమకూర్చిన స్టీల్ గేట్లను శనివారం అమర్చినట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు తెలిపారు. పాడేరు ప్రముఖ వ్యాపారి దివంగత బూరెడ్డి పైడిరావు అల్లుడు కాకినాడకు చెందిన నాలం ప్రభాకరరావు, మార్గదర్శి ప్రభాకరరావు, పాడేరుకు చెందిన ఎస్‌డీ.రవి ఆర్థిక సాయంతతో ఆలయంలో ఉన్న ఇనుప గేట్లు స్థానంలో వారు అందించిన స్టీలు గేట్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. సభ్యులు బి.వెంకటరమణ, సల్లా రామకృష్ణ, జి.సూర్యప్రకాష్, కె.చంద్రమోహన్ పాల్గొన్నారు.

అరకు రిక్వెస్టు స్టేజీలో రైలు ఆపాలి


ఎమ్మెల్యే వినతిపత్రం అందిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అరకులోయ, జనవరి4 (ఆంధ్రజ్యోతి): అరకులోయ రైల్వే స్టేషన్‌లో రిక్వెస్టు స్టేజీ వద్ద పాసింజర్ రైలు నిలపాలని ఆటోయూనియన్ కార్మికులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను కలిసి వినతి పత్రమందించారు. గత 30ఏళ్లుగా అరకులోయలో పాసింజరురైళ్లు నిలుపుతున్నారన్నారు. హోటల్స్, రిసార్టులు ఉన్నందున పర్యాటకులు, ప్రయాణికులు ఈ స్టేజీలోనే దిగుతున్నారన్నారు. రైలును జనవరి 1వ తేదీ నుంచి నిలుపు చేయడంతో ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఎమ్మెల్యే రేగం మత్సలింగం వాల్టేర్ డీఆర్ఎంకు ఫోన్‌లో మాట్లాడి అరకులోయ రిక్వెస్టు స్టేజీలో పాసింజరురైళ్లను నిలపాలని కోరారు. అలాగే, డీఆర్ఎంకు లేఖ రాస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఈ ఎం.చిన్న, ఎం.రమేశ్, ఎం.వాసంత్, ఎం.మూర్తి, కె.రమణ, కె.గిరి, సీహెచ్.రాజుతదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీకి రూ. 25 వేలు వితరణ


చెక్కు అందిస్తున్న జీసీసీ డైరెక్టర్ నాగరాజు

పాడేరురూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మొబలైజేషన్ డ్రైవ్ చేపట్టి పలువురిని లైఫ్, పేట్రన్ సభ్యులుగా చేర్పించడం అభినందనీయమని కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ లైఫ్ సభ్యుడు బొర్రా నాగరాజు రూ. 25 వేల చెక్కును కలెక్టర్‌కు అందజేసి పేట్రన్ సభ్యులుగా చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. గౌరీశంకరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


రోగులపేటలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్

పాడేరురూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను గిరిజన ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు కోరారు. పంచాయతీ సర్పంచ్ మీనా అధ్యక్షతన వనుగుపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు మాట్లాడుతూ వనుగుపల్లి సదస్సులో మ్యుటేషన్‌లు, భూ సరిహద్దు సమస్యలు, భూతగాదాలపై 92 మంది ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.పోలురాజు, ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, ఆర్ఐ కూడా భాస్కరరావు, మండల సర్వేయర్ వి. భీమయ్య, వీఆర్‌వో కె.నూకరత్నం, ఎఫ్‌బీవో సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, మాజీ సర్పంచ్ పి.నాగరాజు, గ్రామ పెద్దలు ఆనంద్, సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

137 అర్జీలు స్వీకరణ

పెదబయలు: సీతగుంట పంచాయతీలో శనివారం స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ జి. రంగారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై మొత్తం 137 అర్జీలు స్వీకరించారు. ఉదయం చిత్రాయిపుట్టులో నిర్వహించాల్సిన సదస్సును కొన్ని అనివార్య కారణాలతో రోగులపేట జంక్షన్‌లో నిర్వహించినట్టు ఆయన తెలిపారు. పెదబయలలో గల పంచాయతీ కార్యాలయంలో సర్పంచి పి.మాధవరావు సదస్సు నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ రమణ, ఆర్ఐ పూర్ణయ్య, వీఆర్‌వో ఆజాద్, ఎంపీటీసీ సభ్యులు బొంజుబాబు, వైస్ సర్పంచ్ గంగాధరం పాల్గొన్నారు.

సజావుగా పెసా కమిటీ ఎన్నికలు


మినుములూరు అధ్యక్ష, కార్యదర్శులకు ధ్రువపత్రాలిస్తున్న అధికారి

పాడేరురూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పెసా ఎన్నికలు జరిగాయి. 33 చోట్ల నిర్వహించిన ఎన్నికల్లో అన్ని చోట్ల ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్తనాపల్లిలో కోరం లేక కార్యదర్శి ఎంపిక నిలిచిపోయినట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. కిండంగిలో ఉపాధ్యక్షుడిగా మొస్యా పాలవెల్లి, కార్యదర్శిగా సరమండ కృష్ణమరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డీపీవో లవరాజు, పంచాయతీ సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ ఎస్‌వీవీ రమణ, డుంబేరు విశ్వనాథం పాల్గొన్నారు. మినుములూరు పంచాయతీ సర్పంచ్ లంకెల చిట్టమ్మ అధ్యక్షతన నిర్వహించిన పెసా కమిటీ ఎన్నికలు ఏక గ్రీవమైనట్టు ఎన్నికల అధికారి కె.మత్స్యలింగం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా లింగేరి సుందరరావు, కార్యదర్శిగా మినుముల మణికంఠపాత్రుడు ఎన్నికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు ఎం. కన్నాపాత్రుడు, బి.మహేష్, సత్యనారాయణ, రాంబాబు, డి.బిమలమ్మ, కొండబాబు పాల్గొన్నారు.

ఎనిమిది చోట్ల వాయిదా

చింతపల్లి: మండలంలో ఎనిమిది చోట్ల పెసా ఎన్నికలు కోరంలేక ఎన్నికలు వాయిదాపడినట్టు ఎన్నికల అధికారి, ఏడీఏ కంటా జాహ్నవి తెలిపారు. 29 పెసా గ్రామ సభలకు ఎన్నికలు ఏర్పాటు చేశారు. 21 సభల్లో ఎన్నికలు జరిగాయన్నారు. 15 గ్రామ సభలు ఉపాధ్యక్షుడు, కార్యదర్శిలను ఓటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఆరు చోట్ల చేతులెత్తేపద్ధతిలో ఎంపిక నిర్వహించారు. చిన్నగెడ్డ, చెరుకుంపాకలు, తాజంగి, రాజేంద్రపురం, ఎర్రవరం, ఎర్రబొమ్మలు, పకాబు, బౌడ గ్రామ పంచాయతీల్లో కోరంలేక ఎన్నికలు జరగలేదన్నారు.ఈ ఎన్నికలను ఈనెల 7తేదీలోగా ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, తహసీల్దార్ రవి కుమార్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి:మండలంలో రెండో రోజు ప్రశాంతంగా పెసా ఎన్నికలు జరిగాయని ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 16పంచాయతీల్లో 28 గ్రామ సభలకు ఎన్నికలు జరిగాయన్నారు. ప్రతి గ్రామ సభలోనూ ఉపాధ్యక్షులు, కార్యదర్శిలను ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

డుంబ్రిగుడ: మండలంలో కితలంగి పంచాయతీ కేంద్రంలో జరిగిన పెసా కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అరకు టీడీపీ పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, పంచాయతీ సర్పంచ్ సుబ్బారావు అధికారులతో కలసి ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. పోతంగి పంచాయతీ చెలిమర వలసలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, పోతంగి సర్పంచ్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన జీసీసీ చైర్మన్


సీఎం చంద్రబాబునాయుడుకు జీసీసీ ఉత్పత్తులను అందిస్తున్న చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ శనివారం సాయంత్రం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీసీసీ ఉత్పత్తులను ఆయనకు అందించారు. గిరిజన కాఫీ రైతులకు ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని సీఎంను కోరారు. జీసీసీని ప్రత్యేకమైన బ్రాండ్‌గా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.

ఆస్పత్రిల్లోనే ప్రసవం పొందాలి: డీఎంహెచ్‌వో


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

గూడెంకొత్తవీధి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో డోలి మోతల సమస్యను పరిష్కరించేందుకు ఆస్పత్రులకు అనుబంధంగా గర్భిణుల వసతి గృహాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రసవ సమయానికి పది రోజులు ముందు గర్భిణుల వసతి గృహంలో చేరాలన్నారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం పొందడం వల్ల తల్లి, బిడ్డకు సురక్షితమన్నారు. జీకేవీధికి నూతన అంబులెన్సు సమకూర్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లామన్నారు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈసర్వేలో కేన్సర్, బీపి, షుగర్ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్ కుమార్, అచ్యుత్ పాల్గొన్నారు.

చెరువు, చెక్‌డ్యామ్‌ల అభివృద్ధికి ప్రణాళిక


కోటగున్నలు చెక్ డ్యామ్ పరిశీలిస్తున్న ఎస్ఎంఐ డీఈఈ నాగేశ్వరరావు

చింతపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.1.5 కోట్ల నిధులతో చెరువులు, చెక్‌డ్యామ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పాడేరు ఎస్ఎంఐ డీఈఈ నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని చౌడపల్లి, తాజంగి, కోటగున్నలు గ్రామాల్లో చెరువులు, చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాడేరు డివిజన్ పరిధిలో 76పనులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామన్నారు. చింతపల్లి మండలంలో చౌడుపల్లి, లోతుగెడ్డలో ఒక్కొక్కటి, తాజంగి, పెదబరడ, బలపం, బెన్నవరం, కుడుముసారిలో రెండు చొప్పున చెక్‌డ్యామ్‌లు, చెరువులు మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.5కోట్లను విడుదల చేసిందన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. తాజంగి జలాశయం కాలువకు రూ.35 లక్షలు, చౌడుపల్లి చెరువు మరమ్మతులకు రూ.20లక్షలు విడుదలయ్యాయన్నారు. పులిగొంది జలాశయం అభివృద్ధికి రూ.కోటి అంచనా వ్యయంతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఈ లోకేశ్, చౌడుపల్లి నీటి సంఘం అధ్యక్షుడు కంతా వెంకట రమణ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడాలి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత

చింతపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు ఆధారంగా పంటలకు ఎరువులు అందించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం భూసార విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి. శ్రీలత అన్నారు. శనివారం స్థానిక పరిశోధన స్థానంలో సేంద్రియ సాగుపై శిక్షణ పొందుతున్న విద్యార్థులకు భూసారంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడం వల్ల నేలలో పోషకాలు ఏస్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చునన్నారు. స్థానిక పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యప్పరెడ్డి మాట్లాడుతూ నూనెగింజల పంట వలిసెలకు సేంద్రియ పద్ధతిలో సాగు చేసుకోవడం లాభదాయకమన్నారు. పంటకు కంపోస్టు, వర్మీకంపోస్టు ఎరువులను పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, భూసారశాస్త్రవేత్త జోగారావు పాల్గొన్నారు.

నలుగురు ఏఎస్‌ఐలకు పదోన్నతి


డీఐజీ కార్యాలయం ఎదుట తత పదోన్నతి పొందిన సిబ్బంది

అనకాపల్లి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఏఎస్‌ఐలకు పదోన్నతి కల్పిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన గిరి, అర్జున్, సన్యాసిరావులకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించి ఇదే జిల్లాకు కేటాయించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఏఎస్ఐ శంకరరావుకు ఎస్ఐ పదోన్నతి కల్పించి ఆ జిల్లాకే కేటాయించారు. పదోన్నతి పొందినవారు శనివారం విశాఖలోని డీఐజీ కార్యాలయానికి వెళ్లి డీఐజీకి కృతజ్ఞతలు తెలిపారు.

వారపు సంతలో సీఆర్‌పీఎఫ్ గస్తీ

ముంచంగిపుట్టు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు గస్తీ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు రోడ్ల కూడలిపై రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సంతనుంచి మారుమూల గ్రామాలవైపు వెళ్లే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి


మృతుడు నాగభూషణ్

డుంబ్రిగుడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు - పాడేరు ప్రధాన రహదారిలోని కించుమండ, బిల్లాపుట్ జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందారు. పెదబయలు మండలం గంపరాయి కి చెందిన అడప నాగభూషణ్ (34) అరకులోయలోని గురుకుల కళాశాలలో పీడీగా పని చేస్తున్నారు. పిన్ని అనారోగ్యంతో మృతి చెం దినట్టు తెలియడంతో నాగభూషణ్ బైక్‌పై కళాశాలనుంచి బయలుదేరారు. కించుమండ-బిల్లాపుట్టు జాతీయ రహదారిలో బైకును అరకులోయవైపు వస్తున్న టూరిస్టు కారు బలంగా ఢీ కొంది. నాగభూషణ్ ఎగిరిపడి డివైడర్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. "ఈ ప్రమాద సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా కేసులో భార్యాభర్తలకు నాలుగేళ్ల జైలు

చింతపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో భార్యాభర్తలకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.పది వేలు జరిమాన విధిస్తూ విశాఖపట్నం ఎంఎస్‌జే కోర్టు న్యాయమూర్తి ఎం. వెంకటరమణ తీర్పు ఇచ్చారని స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.కూర్మారావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రోలుగుంట మండలం బెన్నగోపాలపట్నం గ్రామానికి చెందిన భార్యాభర్తలు తాడి అప్పలనాయుడు, లక్ష్మిలు 2013లో మైదాన ప్రాంతాలకు గంజాయి తరలిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడడంతో కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు విచారణలో పీపీ జీవీఎంఎస్ ప్రసాద్ న్యాయస్థానం ఎదుట వాదనలు వినిపించారన్నారు. పీపీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితులకు పైవిధంగా తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు.

కళాశాల విద్యార్థులకు వరం.. భోజన పథకం

- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

చోడవరం/రోలుగుంట/రావికమతం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం చక్కని వరమని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అభివర్ణించారు. చోడవరం నియోజక వర్గం పరిధిలోని అన్ని జీజే కళాశాలల్లో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. చోడవరం, రోలుగుంట కళాశాలల్లో ఎమ్మెల్యే రాజు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి కళాశాల లకు ఉదయాన్నే బయలుదేరి వచ్చే విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విని యోగించుకుని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని కోరారు. అలాగే రావికమతం కళాశాలలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టు కుని ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా నీలవేణి కోరారు. ఈ కార్యక్రమాల్లో చోడవరం, రోలుగుంట ఎంపీపీలు గాడి కాసు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, చోడవరం ఎంపీడీవో పీఎస్‌జే ఆంజనేయులు, ఎంఈవో సింహాచలం, చోడవరం, రోలుగుంట, రావికమతం కళాశాలల ప్రిన్సిపాళ్లు పి.ఉమారాణి, అప్పలరాజు, సత్యవతి, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మల్లునాయుడు, మత్స్యరాజు, డీవీ అప్పారావు, ఎస్.శ్రీనివాస రావు, టి.శ్రీనివాసరావు, ఈర్లె శ్రీనివాస్, జి.చంద్రమౌళి, రామకృష్ణ, పంచాడ చంద్ర, కోట గోవిందరావు, రాజాన కొండనాయుడు, కె.సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చోడవరం కాలేజీలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రాజు

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/కె.కోటపాడు/దేవరాపల్లి/చీడికాడ: మాడుగుల నియోజక వర్గం పరిధిలోని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. మాడుగుల, కె.కోటపాడు కళాశాలల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పథకాన్ని ప్రారంభించడంతో పాటు స్వయంగా వడ్డించారు. అలాగే పిల్లలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే బండారు మాట్లా డుతూ ప్రభుత్వం ఈ పథకాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తల్లిదండ్రులకు ఉదయాన్నే లేచి క్యారేజీ వండే భారం తగ్గించిందని చెప్పారు. అలాగే సమయానికి విద్యార్థులు కళాశాలలకు వచ్చి అధ్యాపకులు బోధించే పాఠ్యాంశాలు శ్రద్ధగా వినే అవకాశం కలుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే చీడికాడ మండలంలోని మంచాల మోడల్ కళాశాలలో ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. కళాశాలల్లో భోజన పథకం అమలు చేయడం ప్రభుత్వం తీసుకున్న చక్కని నిర్ణయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా ఉపయోగించుకోవాలని కోరారు. దేవరాపల్లి కళాశాలలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. కళాశాలల్లో భోజన పథకం అమలుతో విద్యార్థు లతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ఎంతగానో మేలు చేకూరుతుం దని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రమాదేవి, పి.భాగ్యవతి, ఎంపీడీవోలు కొంకి అప్పారావు, సాంబశివరాలు, ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ప్రిన్సిపాళ్లు ఎస్.నిర్మల, నాగమణి, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు కర్రి సత్యం, కిలపర్తి రాజేశ్వరి, పుప్పాల అప్పలరాజు, ఉండూరు దేముడు, యడ్ల కళావతి, డి.సూర్యారావు, లెక్కల కాశిబాబు, పుప్పాల రమేశ్, డిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వర్రావు, రొబ్బా మహేశ్, రొంగలి మహేశ్, బాలిబోయిన సంతోశ్, డి.నరసింహమూర్తి, యర్రంశెట్టి భవాని, జూరెడ్డి రాము, కన్నూరు సూర్యనారాయణ, కశిరెడ్డి అప్పలనాయుడు, బొడ్డు అక్కునాయుడు, బండారు నరసింహనాయుడు, గెడ్డం బ్రహ్మాజీ, భూపతి అప్పలరాజు, ఉగ్గిన త్రినాథ్, గంగాభవానీ, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


కె.కోటపాడులో భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

నర్సీపట్నం నియోజకవర్గంలో...

మాకవరపాలెం/కృష్ణాదేవిపేట: నర్సీపట్నం నియోజకవర్గంలోని జీజే కళాశాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. మాకవరపాలెం కళాశాలలో ఎంపీడీవో సీతా మహాలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. పౌష్టికాహార లోపం లేకుండా ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.భారతశ్రీ, నాయకులు లాలం రాము, విక్రమ్, జమీలు పాల్గొన్నారు. అలాగే కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పథకం నిరుపేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తుందన్నారు. పథకాన్ని సద్వినియోగపర్చుకుని చదువులో రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోచల సుజాత, ఉప సర్పంచ్ కుండల కొండతల్లి, కూటమి నాయకులు బొడ్డు జమీలు, పెట్ల నారాయణమూర్తి, గాడి అప్పలనాయుడు, చిటికెల చిట్టిబాబు, రాజుల నాయుడు, రాజులునాయుడు, చింతల స్వామినాయుడు, మువ్వల సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, అదనపు ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, అధ్యాపకులు శ్రీనివాస్, గోవిందు, చిన్ని పాల్గొన్నారు.


కృష్ణాదేవిపేట కళాశాలలో భోజనం వడ్డిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రూ.4.1 కోట్లతో అర్ల-పిత్రిగెడ్డ రోడ్డు నిర్మాణం

- పంచాయతీరాజ్ శాఖ ఈఈ వీరినాయుడు

రోలుగుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్ల-పిత్రిగెడ్డ రోడ్డు నిర్మాణానికి రూ.4.1 కోట్లు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వీరినాయుడు తెలిపారు. శనివారం ఉదయం అర్ల నుంచి పిత్రిగెడ్డ వరకు ఏర్పాటు చేసే రోడ్డును పరిశీలించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, స్థానిక గ్రామ నాయకులతో కలిసి కాలినడకన 12 కిలోమీటర్ల వరకు పరిశీలించి, రోడ్డు నిర్మాణ పనులు ఏ విధంగా చేపట్టాలనే అంశాలను పరిశీలించారు. రోడ్డు లేక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం గుర్తించి నిధులు మంజూరు చేసిందని, త్వరలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఈఈ తెలిపారు.

సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

మాకవరపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు సూచించారు. మండలంలోని కొండలఅగ్రహారం, జి.గంగవరం గ్రామాల్లో సంపద కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. అనంతరం లచ్చన్నపాలెంలో నిర్మిస్తున్న రోడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సీతామహాలక్ష్మి, జి.గంగవరం మాజీ సర్పంచ్ రమణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వెంకన్నపాలెంలో స్వచ్ఛతా హీ సేవా

చోడవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వెంకన్నపాలెం గ్రామంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కాలువలను పరిశుభ్రం చేయడంతో పాటు పరిసరాల్లో బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీఎస్‌జే ఆంజనేయులు, కార్యదర్శి గంగాధర్, సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.రమణ పాల్గొన్నారు.

108 సేవలు మరింత మెరుగుపరుస్తాం

- రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ మురుగన్


108, 104 సిబ్బందితో రాష్ట్ర నోడల్ అధికారుల బృందం

చోడవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 108తో పాటు 104 సేవలు మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని 108 రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ఎం.మురుగన్ తెలిపారు. శనివారం 108, 104 వాహనాల తనిఖీల కోసం వచ్చిన మురుగన్ బృందం రెండు విభాగాల సిబ్బందితో మాట్లాడారు. వాహనాల పనితీరు, వారు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా 108, 104 విభాగాల సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను బృందం సభ్యులకు వివరించారు. రెండు విభాగాల సేవలు మరింత చక్కగా ప్రజలకు అందించేలా ప్రభుత్వం సంకల్పంతో ఉందని, తాము కూడా సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ వీవీ త్రినాథరావు, 104 విభాగం డీఎం అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానం

కృష్ణాదేవిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ, నేవీ, పోలీస్ కానిస్టేబుల్ తదితర ఉద్యోగాలు సాధించేలా యువతను ప్రోత్సహించడానికి క్రీడా మైదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఏఎల్‌పురం హైస్కూల్ ఆవరణలో శనివారం మైదానం ఏర్పాటు పనులు చేపట్టారు. 400 మీటర్ల ట్రాక్, లాంగ్ జంప్ కోసం కోర్టును తయారు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలంటే సరైన ఆట స్థలం అవసరమని గుర్తించి ఈ పనులను చేపడుతున్నట్టు చెప్పారు. ఇందుకు సహకరించిన కాంట్రాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పీఈటీ టీవీ రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నర్సీపట్నం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం ధర్మసాగరంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, సర్పంచ్ కన్నయ్యనాయుడు, ఏవో రమణబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు


రావికమతంలో మేలుకొలుపు నిర్వహిస్తున్న భక్తులు

రావికమతం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం భక్తులు మేలుకొలుపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సమరసిత సేవా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన భజన బృందం, ప్రజలు పాల్గొని గోవింద నామస్మరణతో పుర వీధుల్లో కలియ తిరిగారు. నెలగంట పెట్టిన నాటి నుంచి రోజుకొక వీధిలో ఈ సభ్యులు గోవింద నామస్మరణ, భక్తి గీతాలపనలు చేస్తున్నారు. వేకువజాము నాలుగు గంటల నుంచే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హిందు సంప్రదాయాన్ని పరిరక్షించడమే మేలుకొలుపు ఉద్దేశమని సంఘ సభ్యులు ముక్కా జోగేశ్వరావు, పి.సత్యనారాయణ తెలిపారు.

దేవికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

దేవరాపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా దేవరాపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఎస్‌బీటీఎస్.దేవీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. భారతీయ చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వంద మంది ఉపాధ్యాయులను గుర్తించారు. ఇందులో బాగంగా దేవి ఎంపికయ్యారు. ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రేణుదేశాయ్, సినీ నటుడు బ్రహ్మానందం చేతుల మీదుగా శుక్రవారం ఆమె అవార్డును అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న టీచర్ దేవి

మాడుగులలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం మాడుగులలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. స్థానిక దుర్గాలమ్మ ఆలయ సమీపంలో ప్రెస్‌క్లబ్ భవనం పక్కన ఉన్న స్థలాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం అధికారులు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మాడుగుల సమీపాన గల ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకోసం పంచాయతీ తీర్మానం చేయాలని సర్పంచ్ యడ్ల కళావతికి, కార్యదర్శి మూర్తిబాబుకు ఆదేశించారు. అన్న క్యాంటీన్ కోసం రూ.61 లక్షలు మంజూరయ్యిందని, రెండు నెలల్లో ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్న క్యాంటీన్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం ఎదురుగా ఉన్న మాంసం, చేపల దుకాణాల కారణంగా దుర్వాసన వస్తుందని, ఇక్కడ భోజనానికి వచ్చేవారు ఇబ్బందులు పడతారని చెప్పారు. ఇక్కడి మాంసం దుకాణాలను వెంటనే గ్రామానికి దూరంలో ఖాళీగా ఉన్న స్థలంలోకి మార్పు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. టిఫిన్, భోజనాలను రూ.5కే ఎంతమంది ఉన్నా అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల కార్యదర్శి ఉండూరు దేముడు, సర్పంచ్ కళావతి, మాజీ సర్పంచ్ డి.సూర్యారావు, నాయకులు పాల్గొన్నారు.


మాడుగులలో అన్నా క్యాంటీన్ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి

- చోడవరం ఎమ్మెల్యే రాజు


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. శనివారం దొండపూడి గ్రామం వచ్చిన ఆయన మాజీ సర్పంచ్ వెదురుపర్తి వెంకటాచారి ఇంటి వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రావికమతం మండలం ఏళ్ల తరబడి విద్య, ఉపాధి అవకాశాల్లో వెనుకబాటుతో ఉన్నందున ఇక్కడ విద్యార్థులు, యువతీ, యువకులు ఖాళీగా ఉండిపోతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, పలు గ్రామాల నాయకులు ఎమ్మెల్యే రాజు దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ అందరికీ అనుకూలంగా ఉన్న చోట అవసరమైన భూమి చూపితే నెల రోజుల వ్యవధిలోనే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యేలా అనుమతులు తీసుకోస్తానని భరోసా ఇచ్చారు. అలాగే ఈ ప్రాంతంలో అనుకూల ప్రదేశం గుర్తిస్తే పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ పరిశ్రమలో స్థానికులకే శతశాతం ఉద్యోగ అవకాశాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వెదురుపర్తి వెంకటాచారి, కోట గోవిందరావు, వజ్రపు శివ, జి.మోదునాయుడు, గల్లా నానిబాబు, బంటు శ్రీను, కొప్పాక నాయుడు పాల్గొన్నారు.

షుగర్స్ కార్మిక సంఘం నేత నానిబాబు మృతి

చోడవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘానికి చెందిన నాయకుడు పీవీఎస్ నానిబాబు మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నానిబాబు శనివారం ఉదయం పరిస్థితి విషమించడంతో మరణించారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కార్మికులు ఫ్యాక్టరీ ఆవరణలో నానిబాబు మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎండీ వి.సన్యాసినాయుడు, కార్మిక సంఘం నేత భాస్కరరావు పాల్గొన్నారు.


నానిబాబు (ఫైల్)

గంజాయితో నలుగురి అరెస్టు

చోడవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గంజాయితో నలుగురు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ శివారు గౌరీపట్నం జంక్షన్ వద్ద వ్యాగన్ ఆర్ కారులో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. సీఐ అప్పలరాజుకు అందిన సమాచారం మేరకు గౌరీపట్నం జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వ్యాగన్ ఆర్ కారులో ఆరు కిలోల గంజాయి తరలిస్తూ ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. ఈరిలో చింతలపూడి లావణ్య, వెంకట సత్యకుమార్, చొప్పా దిలీప్ ఉన్నారు. నిందితులను అరెస్టు చేసి కారును పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ నాగకార్తీక్ తెలిపారు. అలాగే గంజాయి కేసులో నిందితుడిగా ఉన్న ముంచంగిపుట్టు మండలం పోలిపుట్టు గ్రామానికి చెందిన బడ్నాయక్ కేశవరావును శనివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కొంత కాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న కేశవరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు.

టి.అర్జాపురంలో సీసీ డ్రైనేజీ నిర్మాణం

రావికమతం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో టి.అర్జాపురం గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నామని సర్పంచ్ మడగల అర్జున చెప్పారు. డ్రైనేజీ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 వేల జనాభా గల ఈ గ్రామంలో మొదటి నుంచి డ్రైనేజీలు లేక వర్షం నీటితో పాటు వాడుక నీరు రోడ్లపైకే వస్తుండంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. అయితే విపక్ష సర్పంచ్‌ననే కారణంతో వైసీపీ ప్రభుత్వ వివక్ష చూపిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామ అభివృద్ధికి అవకాశం కలిగిందని, ఈ నేపథ్యంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చొరవ చూపామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ నిధులు జోడించి ఈ పనులు పూర్తి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గౌరినాయుడు



కృష్ణాదేవిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గొలుగొండ మండల అధ్యక్షుడిగా చందక గౌరినాయుడు నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నిక ముందు నుంచి గౌరినాయుడు మండల అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో, మరలా ఆయనకే రెండోసారి బాధ్యతలు అప్పగించారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని ఈ సందర్భంగా గౌరినాయుడు చెప్పారు.

బీజేపీ మండల నూతన కార్యవర్గం

నాతవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కార్యవర్గాన్ని శనివారం కార్యకర్తలు ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా సబి కుమారస్వామి, సమన్వయకర్తగా యర్రా సూర్యనారాయణను ఎన్నుకున్నారు. అందరిని కలుపుకుంటూ క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృసి చేస్తానని ఈ సందర్భంగా అధ్యక్షుడు కుమారస్వామి తెలిపారు.

ఏఎల్‌పురం, సిహెచ్.నాగారంలో గ్రామసభలు

కృష్ణాదేవిపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, సిహెచ్.నాగాపురం గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఏఎల్‌పురంలో రోడ్డు, డ్రైనేజీ మెరుగుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ లోచల సుజాత చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్ఐ రహీమ్, ఎంపీపీ మణికుమారి, సిహెచ్.నాగారం సర్పంచ్ రఘురామ్, ఎంపీటీసీ సభ్యుడు ఎం.కృష్ణ, నాయకులు బొడ్డు జమీలు, ఎల్.రాజులనాయుడు, కె.రామారావు, బొప్పన ప్రసాద్, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ల బాధ్యతలపై అవగాహన అవసరం

నాతవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లు తమ బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యా శాఖ అధికారి-1 సత్యనారాయణ స్పష్టం చేశారు. నాతవరం హైస్కూల్‌లో 64 పాఠశాలల స్కూల్ యాజమాన్య కమిటీల చైర్మన్లకు బాధ్యతలు, విధులపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చెప్పిన విషయాలను అవగాహన చేసుకుని పాఠశాలల అభివృద్ధి, విద్యారుథులు ప్రగతికి తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే పాఠశాలలను సందర్శించి మెనూ అమలు తీరును పరిశీలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కె.వరహాలబాబు, నాతవరం హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిటికెల శ్రీను, చమ్మచింత హైస్కూల్ హెచ్ఎం కె.శివరామప్రసాద్, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.